క్లుప్తంగా

8న తుది ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో మధుసూదన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్హులైన వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 8న ప్రకటిస్తారన్నారు. అనంతరం ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. నాయకులు నరేందర్, నిత్యనందరావు, ఎలక్షన్ డీటీ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

6న ఠాణా దివస్

ముస్తాబాద్: మండల పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 6న ఠాణా దివస్ నిర్వహించనున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఠాణా దివస్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30గంటల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

రుద్రంగి: ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించేందుకు అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ విశాలమైన తరగతుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన, డిజిటల్ లైబ్రరీ ఈ కళాశాల ప్రత్యేకత అని పేర్కొన్నారు. అధ్యాపకులు కీర్తి రాజేశ్, ఆర్ అర్జున్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగయ్య పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు తీర్మానం



తీర్మాన కాపీ అందిస్తున్న వార్డు సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో తెలంగాణ పోరాట సమరయోధుడు దొడ్డి కొమురయ్య యాదవ్ విగ్రహ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. బుధవారం విగ్రహ ఏర్పాటుపై సర్పంచ్ వెంకట్‌రెడ్డికి పాలకవర్గం సభ్యులు తీర్మాన కాపీని అందజేశారు. వెంటనే విగ్రహ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఉపసర్పంచ్ రజిత,అకిల భారత యాదవ సంఘం మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 5న కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. నాయకులు కోడం రమణ, మల్లయ్య, కృష్ణవేణి, నర్సయ్య, అంజయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ప్రజలు నియంత పాలనకు చరమగీతం పాడి ప్రజాపాలన తెచ్చుకున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని నేరెళ్ల సర్పంచ్ బొబ్బల మంజుల మల్లేశ్ యాదవ్ దంపతులు బుధవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఎంపీటీసీ రాము, కాంగ్రెస్ జిల్లా నాయకులు రాంలింగారెడ్డి, వైద్య శివప్రసాద్, భూపతి, తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు శ్రీకాంత్ గౌడ్, పరుశురాం, రాజు, మల్లేశ్ యాదవ్, భరత్ గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన మేర్గ శ్రీనివాస్(35) మంగళవారం పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడు మద్యంకు బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

శిబిరానికి కౌన్సిలర్లు

- వేడెక్కిన వేములవాడ రాజకీయాలు
- వైస్‌చైర్మన్ రేసులో బింగి మహేశ్, మారం కుమార్



క్యాంప్‌లో ఉన్న కౌన్సిలర్లు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారుతోంది. మధు రాజేందర్ రాజీనామాతో ఏర్పడిన ఈ ఖాళీని భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 12న వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలంటూ కలెక్టర్ అనురాగ్ జయంతి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వైస్‌చైర్మన్ స్థానం కోసం బీఆర్‌ఎస్ నుంచి మారం కుమార్, కాంగ్రెస్ నుంచి బింగి మహేశ్ పోటాపోటీగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు బుధవారం మారం కుమార్ తమ పార్టీ కౌన్సిలర్లతో కలిసి హైదరాబాద్‌లోని క్యాంపునకు తరలినట్లు సమాచారం. దీంతో వేములవాడ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతోపాటు మరో ముగ్గురి మద్దతు తనకే ఉందంటూ ఓ వైపు మారం కుమార్, మరోవైపు బింగి మహేశ్ ధీమాతో ఉన్నారు.

కౌన్సిలర్లకు కాసుల పంట ?

మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక వేములవాడ కౌన్సిలర్లకు వరంగా మారనుంది. ఇద్దరు వేర్వేరు పార్టీల నాయకులు పోటీకి దిగడంతో కౌన్సిలర్లకు డిమాండ్ పెరిగింది. ప్రొటోకాల్ పోస్టు కాకపోయినప్పటికీ వైస్‌చైర్మన్ హోదా కోసం ఇరుపక్షాలు పోటాపోటీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో కౌన్సిలర్‌కు రూ.లక్ష వరకు అందనున్నట్లు ప్రచారంలో ఉంది. మరికొందరైతే ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యురాలు సంధ్యారాణి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్యబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు మందులు అందజేశారు. విద్యార్థులు పరీక్ష సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని, భయంవీడి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాం, వైద్యబృందం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలస కార్మికులను ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: వలస కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. సిరిసిల్ల శివారులో నివాసముంటున్న మధ్యప్రదేశ్, బీహార్ తదితర ప్రాంతాల నుంచి ఉపాధికోసం వచ్చిన కార్మికులతో మాట్లాడారు.కనీస వసతుల్లేకుండా గుడిసెలో వారు నివసిస్తున్నారన్నారు. కార్మికులను ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, రాజు తదితరులున్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం సర్పంచ్ పాశం సరోజన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సూర భాస్కర్, గోవులకొండ శ్రీనివాస్, కొండకింది శ్రీనివాస్, కొప్పు లక్ష్మణ్, మురళి, జడల భాగ్యలక్ష్మిని సత్కరించారు. అనంతరం వారు పాఠశాలకు రూ.10వేల విలువగల వాటర్‌కూలర్‌ను అందజేశారు. ఉపసర్పంచ్ దేవయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై జెడ్పీ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంకు వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయురాలు లక్ష్మీకి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో బన్నాజీ, ఉపాధ్యాయులు జయశ్రీ, కృష్ణ, పాల్గొన్నారు.

సిరిసిల్లతో కేటీఆర్‌కు ఉన్న బంధమేంటి ?

- మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చి ఎమ్మెల్యే అయిండు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): అమెరికాలో ఉద్యోగం కోల్పోయి కేసీఆర్ కొడుకు అనే గుర్తింపుతో మేనేజ్‌మెంట్ కోటాలో కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యిండని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నియంతృత్వ, అవినీతి పాలనకు వ్యతిరేకంగా వేలాది మంది బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. సిరిసిల్ల బీఆర్‌ఎస్‌లో ఇక మిగిలేదీ ముగ్గురేనని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయినా కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోకపోతే సిరిసిల్ల ప్రజలు బొంద పెడతారని హెచ్చరించారు. సిరిసిల్లకు కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, నరేశ్, దేవేందర్, కిషన్, రాజేందర్, రాజేశం, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘననివాళి

సిరిసిల్లటౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ రాష్ట్ర సాధనలో ప్రదర్శించిన పోరాట పటిమ మరవలేనిదని నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గద్దర్ జయంతిని గాంధీచౌక్‌లో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, ఆడెపు చంద్రకళ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, టోని, జగన్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

ముస్తాబాద్: సామాజిక విప్లవకారుడు, గద్దర్ ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గద్దర్ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ జెడ్పీటీసీ యాదగిరిగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, నర్సింలు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: జర్నలిస్టు ఏకే యాదవ్ జయంతి సందర్భంగా మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏకే యాదవ్ కుటుంబ సభ్యులు, మిత్రులు, జర్నలిస్టులు, మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రత్యేక గుర్తింపు

- గ్రామ పరిపాలనలో తమదైన ముద్ర • ముగిసిన సర్పంచుల పదవి కాలం • మహిళా సర్పంచుల మనోగతం



తంగళ్లపల్లి (సిరిసిల్ల): పల్లె పాలనలో అతివలు తమదైన ముద్ర వేశారు. ఐదేళ్లలో గ్రామాలను తీర్చిదిద్దలంలో ఎంతో శ్రమించి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. కుటుంబం, ప్రజాసేవ రెండింటిని సమన్వయపర్చుకుంటూ పాలనలో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఐదేళ్లలో పురుషుల కంటే దీటుగా గ్రామాలను అభివృద్ధి చేసి చూపించారు. పదవి కాలం పూర్తయిన సందర్భంగా మండలంలోని పలువురు మహిళా సర్పంచుల మనోగతం...

నాన్న స్ఫూర్తితో



మండెపల్లి గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్లు పనిచేయడం సంతృప్తినిచ్చింది. నాన్న స్ఫూర్తితో ప్రజాసేవలోకి అడుగుపెట్టాను. సర్పంచ్‌గా ఎన్నికయ్యాక ప్రజలకు అందుబాటులో ఉండాలని న్యాయవాద వృత్తిని దూరంపెట్టాను. పదవికాలం చేపట్టిన నుంచే గ్రామాభివృద్ధికి పాటుపడాలని అనుకున్నా. గ్రామానికి ఆదర్శగ్రామంగా అవార్డు రావడం సంతోషంగా ఉంది.

– గణప శివజ్యోతి సర్పంచ్ మండెపల్లి

అన్నింటా ముందుండాలి



మహిళలకు రాజకీయాలు ఎందుకు అనేవారికి సర్పంచులుగా ఐదేళ్ల పాలన అందించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఎన్నో ఒడిదొడుకులను తట్టుకొని గ్రామాభివృద్ధి కోసం పనులు చేపట్టాం. రాజకీయాల్లో మహిళలు రాణించాలి.

– బైరి శ్రీవాణి సర్పంచ్ ఇందిరమ్మకాలనీ

తొలి సర్పంచ్ నేనే



మండలంలో పాపయ్యపల్లె గ్రామపంచాయతీ కొత్తగా ఏర్పాటైంది. తొలి సర్పంచ్‌గా మహిళగా నాకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా.. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సర్పంచ్‌గా పదవిని సమర్థవంతంగా నిర్వహించా. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేశా.

– నక్క రేవతి, సర్పంచ్ పాపయ్యపల్లె

ప్రజా శ్రేయస్సుకు పెద్దపీట



మా ఆయన ప్రోత్సాహంతో సర్పంచ్‌గా పోటీలో నిలిచా. నేరెళ్ల పేరు చెబితే రాష్ట్రవ్యాప్తంగా ఇతర ఘటనలు గుర్తుకొచ్చేవి. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చాలెంజ్‌గా తీసుకున్నా. ప్రతిఒక్కరూ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించారు.

– బొబ్బల మంజుల, సర్పంచ్ నేరెళ్ల

అధికారులు సహకరించారు



గండిలచ్చపేట గ్రామంలో అందరూ కుటుంబ సభ్యుల్లాగా అందరూ కలిసిమెలిసి ఉంటారు. గ్రామంలో దళితబంధు ప్రత్యేకంగా అమలైంది. నేను సర్పంచ్‌గా దళితబంధు అందించడం మరువలేనిది. గ్రామాభివృద్ధికి అధికారులు ఎంతగానో సహకరించారు.

– నేరటి లక్ష్మి సర్పంచ్ గండిలచ్చపేట

ఎంతో అభివృద్ధి



పదవికాలం అప్పుడే అయిపోయిందా అనిపిస్తుంది. కరోనా సమయంలో సమయం అనుకూలించకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నా. గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఐదేళ్ల పాలనలో ఎంతో ఆనందంగా ఉంది.

– సురభి సరిత, సర్పంచ్ తాడూర్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- సిరిసిల్ల మున్సిపల్ అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక రూపొందించినట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం మున్సిపల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. 16 అంశాలతో కూడిన ఎజెండాలో అభివృద్ధి, సంక్షేమ పనులు, వేసవిలో నీటి సరఫరా ప్రధాన అంశాలుగా పొందుపర్చినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పురపాలక సంఘం డంపింగ్ యార్డులో పవర్‌బోరు ఏర్పాటు, అన్నివార్డుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు ఏర్పాటుకు రూ.25లక్షలు కేటాయించామన్నారు. రెండ్రోజుల క్రితం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పట్టణానికి రాగా కౌన్సిల్ సభ్యులతో కలిసి గత ప్రభుత్వంలో మంజూరుచేసిన రూ. 40కోట్ల నిధులను తిరిగి అందించాలని కోరామని, దీనికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తౌటు కనుకయ్యకు నివాళి

ఇటీవలే మృతిచెందిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తౌటు కనుకయ్యకు కౌన్సిల్ నివాళి అర్పించింది. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా సమావేశం..

మున్సిపల్ సమావేశం ఎప్పటిలాగే బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా నిర్వహించారని బీజేపీ ఫ్లోర్‌లీడర్ బొల్గం నాగరాజుగౌడ్ అన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్‌లో నిధులులేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ఉండటం ఏంటన్నారు. కౌన్సిలర్ గూడూరి భాస్కర్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



ముస్తాబాద్: మద్దికుంటలో పాలకవర్గానికి సన్మానం



చందుర్తి : రామన్నపేటలో..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలోని అన్నిగ్రామాల సర్పంచులను ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి సన్మానించారు. గ్రామాలభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీర్జా, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారయణ, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద్: పంచాయతీ పాలకవర్గాల సేవలు మరువలేనివని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండలంలోని మద్దికుంట, తుర్కపల్లి పంచాయతీ పాలకవర్గాలను సన్మానించారు. సర్పంచులు జనగామ భాగ్యశ్రీ, కాశోల్ల పద్మ, ఉపసర్పంచులు భూమయ్య, కృష్ణవేణి, వార్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: కొత్తపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు, పలుపార్టీల నాయకులు సన్మానించారు. ఎంపీపీ వంగ కరుణ పాల్గొన్నారు. నర్మాలలో సర్పంచ్ ఎడబోయిన రాజును అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలో సర్పంచ్ ఆజ్మీరా రజిత ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులను సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామాభివృద్ధికి సహకరించిన మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్, కార్యదర్శి సిరియా, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

చందుర్తి : మండలంలోని రామన్నపేట జీపీ సిబ్బందిని సర్పంచ్ దుమ్ము అంజయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతం భూలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సుగా ఎంపిక



దివ్య

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన నాగుల రాజేశం-సునీత దంతతుల కుమార్తె దివ్య స్టాఫ్ నర్సుగా ఎంపికైంది. హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో దివ్యకు స్టాఫ్‌నర్సుగా ఉద్యోగ నియామక పత్రాన్ని బుధవారం అందించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉద్యోగం సాధించడంతో ఆమెను గ్రామస్తులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

క్రీడాకారులకు నగదు అందజేత

గంభీరావుపేట: మండలానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు కాంగ్రెస్ అధ్యక్షుడు మండల హమీద్ బుధవారం రూ.5వేలు అందజేశారు. ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ఎంపికలో భాగంగా మొదట హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న అక్షయగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అజయ్‌లు ప్రతిభ కనబర్చి త్వరలో ముంబాయిలో జరగనున్న పోటీల ఎంపికకు వెళ్తున్న వారికి ప్రయాణ ఖర్చుల కోసం నగదును అందించినట్లు హమీద్ తెలిపారు.

విద్యార్థికి అభినందనలు..

వేములవాడఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి ముత్యం యశ్వంత్ అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన జిజ్ఞాస సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో సులభంగా బల్బును తొలగించే కర్రను తయారు చేసి మొదటి బహుమతిని సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవో బన్నాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లెలో పంచాయతీ కార్యదర్శి మౌనికను పాలకవర్గం సభ్యులు సన్మానించారు. పాలకవర్గం ఐదేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా కార్యదర్శిని శాలువాతో సన్మానించారు. సర్పంచ్ కస్తూరి లత తిరుపతి రెడ్డి, ఉపసర్పంచ్ కె.కిషన్ రెడ్డి, వార్డు సభ్యులు ఏ.బాలలక్ష్మి, ఎన్,రేణుక, బి.లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో బుధవారం ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

బోరు మోటారు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని పాపయ్యపల్లె గ్రామంలో రూ.1.90 లక్షలతో నిధులతో ఏర్పాటుచేసిన బోరు మోటారును ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ నక్క రేవతి కొమురయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్, ఉపసర్పంచ్ శనమేని పరుశరాములు, నాయకులు నక్క కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహహింస చట్టంపై అవగాహన

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మహిళా సాధికరాత కేంద్రం కో-ఆర్డినేటర్ రోజా అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం, బాల్యవివాహంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సంఘం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీటీసీ అరుణ్ కుమార్, సీసీలు బాలరక్షాభవన్ సిబ్బంది, విజయ, సఖి సి బ్బంది సంతోషి మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం రద్దు చేయాలని ఫిర్యాదు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలో ఓ ప్రజాప్రతినిధి పేరుతో ఉన్న రేషన్ దుకాణాన్ని రద్దుచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా ప్రజాప్రతినిధిగా ఉంటూ అదే సమయంలో డీలర్‌గా వైదొలగకుండా కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లో కూడా రేషన్ డీలర్‌గా పేర్కొనలేదన్నారు. సదరు ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పరుశరాములు, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

పోలీసుల దాడులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ, చందుర్తి గ్రామాల్లో పాన్‌టేలా దుకాణాలపై సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. గ్రామాల్లో పాన్‌టేలా దుకాణాల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారన్న అనుమానంతో దాడులు నిర్వహించి తనిఖీ చేపట్టారు.

ఎస్సైని కలిసిన సెస్ డైరెక్టర్

గంభీరావుపేట: మండల ఎస్సైగా నూతన బాధ్యతలు చేపట్టిన బి.రాంమోహన్‌ను మండల సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట నాయకులు లింగం యాదవ్, ధ్యాన బోయిన రాజేందర్ ఉన్నారు.